విశాలాంధ్ర గోదావరి జిల్లా
ఏలూరు, పశ్చిమగోదావరి

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర- నూజివీడు టౌన్: ముఖ్యమంత్రి పాదయాత్ర సందర్భంలో వివిధ వర్గాలకు చెందిన ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులకు ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని వెంకట రామారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అమర్ భవనంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నాలుగు ఏళ్లుగా కాంట్రాక్ట్ , ఔట్సోర్సింగ్ రంగంలో పనిచేస్తున్న ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలలో పనిచేసేటువంటి ఉద్యోగులను క్రమబద్ధీక రించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ప్రభుత్వ సర్వీస్ లో ఉన్న కాంట్రాక్ట్ ఉద్యోగులను మాత్రమే క్రమబద్ధీకరిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం సరైనది కాదన్నారు. రాష్ట్రంలో అనేక కార్యాలయాలు ,కార్పొరేషన్లలో సుమారుగా 3లక్షల మంది కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తుంటే , కేవలం రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న 5, 6 వేల మందిని మాత్రమే పర్మినెంట్ చేస్తూ మిగిలిన వారి విషయం ఏమి ప్రస్తావించకుండా మంత్రివర్గంలో నిర్ణయం తీసుకోవడం పట్ల ఆయన అభ్యంతర వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వాగ్దానం చేసిన మేరకు కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ రాష్ట్ర ప్రభుత్వ సర్వీసులో ఉన్న వారితో పాటు ప్రభుత్వ రంగ సంస్థలలో, ప్రభుత్వ విద్యా సంస్థలలో, ఇతర సర్వీసులలో ఉన్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఔట్సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు అనుకూలంగా స్పందించకపోతే ఔట్సోర్సింగ్ , కాంట్రాక్ట్ ఉద్యోగులు, కార్మికులు తమ హక్కులసాధన కోసం ఉద్యమించాల్సిన అవసరాన్ని గుర్తించాలనని రామారావు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఏఐటియుసి సీనియర్ నాయకులు, న్యాయవాదులు ఇందుపల్లి సత్య ప్రకాష్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చాట్ల పుల్లారావు పాల్గొన్నారు.

వివాదాలకు తావు లేకుండా ఓటర్ల జాబితాలు ఉండాలి : కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: వివాదాలకు తావు లేకుండా ఓటర్ల జాబితాలు ఉండాలని పి ఎల్ ఓ లను జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశించారు. శుక్రవారం పురపాలక సంఘం పరిధిలోని సూర్యనారాయణపురంలో ఓటర్లు జాబితాలకు అనుగుణంగా ఒకే ఇంటి నెంబర్‌తో 10 ఓటర్లకు మించి ఉన్న గృహాలను సంబంధిత అధికార యంత్రాంగంతో స్వయంగా వెళ్లి జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆరా తీశారు. ఓటర్ల జాబితా ప్రకారం ఓటర్లు అయా పోలింగ్ బూత్ పరిధిలో ఉన్నారా లేదా అన్న వివరాలు నేరుగా వారినే అడిగి తెలుసుకున్నారు. ఓటరు జాబితాలను పరిశీలించారు. మరణించిన వారిని ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని సూచించారు. పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ చేయాలన్నారు. ఎన్నికల సంఘం ఆదేశాలతో పకడ్బందీగా జాబితా సవరణ చేసి, బోగస్ ఓటర్లపై దృష్టి సారించాలని ఆమె తెలిపారు. ఒకరికి రెండు చోట్ల ఓటు హక్కు ఉన్నా వాటిని తొలగించే బాధ్యత కూడా బూత్ లెవల్ ఆఫీసర్లదే అని ఆమె అన్నారు. తుది ఓటర్ల జాబితా రూపొందించడంతోపాటు కొత్త ఓటర్ల నమోదు కూడా జరగాలి ఆమె సూచించారు.జిల్లా కలెక్టరు తహశీల్దారు వై.రవి కుమార్, పురపాలక సంఘం కమిషనరు యస్.శివ రామ కృష్ణ, బియల్ వో లు, తదితరులు పాల్గొన్నారు.

మట్టి నమూనా సేకరణపై రైతులకు అవగాహన

విశాలాంధ్ర-ఉండి: మట్టి నమూనాను సేకరించటానికి 1 నుంచి5 ఎకరాల భూమిని ప్రామాణికంగా తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటే శ్వరరావు అన్నారు. ఉండి రైతు భరోసా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి బి. సంధ్య అధ్యక్షతన రైతులకు మట్టి నమూనా సేకరణ పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జెడ్. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చెట్ల కింద, సమస్యాత్మక భూముల్లోను, సారవంతమైన, నిస్సారవంతమైన భూముల్లోను మట్టిని కలిపి తీయకూడదని రైతులకు అవగాహన కల్పించారు. సహాయ వ్యవసాయ సంచాలకులు కెఎస్ఎస్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతు భూసార పరీక్ష ద్వారా ఏ నేలలో ఏ పంట వేస్తే మంచి దిగుబడి వస్తుందో తెలుసుకోవడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కళాకారునికి వసుధ ఫౌండేషన్ సాయం

విశాలాంధ్ర -భీమవరం: ఇటీవల గుండెకు సంబంధించి శస్త్ర చికిత్స చేయించుకుని విశ్రాంతి తీసు కుంటున్న ప్రముఖ కళాకారుడు పులఖండం ప్రభా కరరావుకు వసుధ ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు పదివేల రూపా యల చెక్కును శుక్రవారం తమ కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా వసుధ ఫౌండేషన్ కార్యదర్శి మంతెన క్రృష్ణంరాజు, కన్వీనర్ ఇందు కూరి ప్రసాదరాజు మాట్లాడుతూ కళారంగం ద్వారా సమాజాన్ని జాగృతం చేసిన కళాకారులను ఆదుకోవాల్సిన బాధ్యత మనందరిపై నా ఉందన్నారు. కార్యక్రమంలో పలువురు కళాకారులు, కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్ఆర్‌డిఎస్ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు

విశాలాంధ్ర -భీమవరం: ఆర్ఆర్‌డిఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ వి.కె.జె.ప్రసూన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఈనెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవా లని, 26 నుంచి 30వతేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకోవా లన్నారు. నూతన విద్యా విధానం లో భాగంగా బి.కాం(కంప్యూటర్ అప్లికేషన్స్), బి.ఏ(ఎకనామిక్స్), బీఎస్సీ(కంప్యూటర్స్) ప్రధాన సబ్జెక్టులుగా ఉంటాయని ఎకనామిక్స్, హిస్టరీ, ఫిజిక్స్ మైనర్ సబ్జెక్టులుగా ఎంపిక చేసుకోవాలన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి అమల్లోకి వచ్చిన నాలుగేళ్ల డిగ్రీ కోర్సులో భాగంగా డిగ్రీ అనంతరం నేరుగా పి.జి.కోర్సు ద్వితీయ సంవత్సరంలో అడ్మిషన్ పొందవచ్చని మరిన్ని వివరాలకు కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోనే రాష్ట్రం సస్యశ్యామలం

విశాలాంధ్ర-టి నరసాపురం: పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతోనే ఆంధ్రప్రదేశ్ సస్య శ్యామలమవుతుందని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారం, పోలవరం ప్రాజెక్టు సత్వర నిర్మాణం కొరకు సీపీఐ ఆధ్వర్యంలో ప్రారంభమైన జీపు జాతా శుక్రవారం టి నరసాపురం మండలంలోని సీతంపేట, మక్కినవారిగూడెం, టి నరసాపురం, బందంచర్ల, మద్యాహ్నపు వారి గూడెం, అప్పలరాజు గూడెం గ్రామాలలో సాగింది. టి నరసాపురం అంబేద్కర్ సెంటర్లలో జీపు జాతాను ఉద్దేశించి కృష్ణ చైతన్య మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణంతో 7.20 లక్షల ఎకరాలకు సాగునీరు, వందల గ్రామాలకు త్రాగునీరుతో పాటు, 960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని తెలిపారు. మండలాన్ని యూనిట్‌గా తీసుకుని అందరికీ ఆర్అండ్ఆర్ ప్యాకేజీ అందజేసి పునరావాస కేంద్రాలకు తరలించాలని డిమాండ్ చేశారు. గ్రామాలను తరలించేనాటికి 18సంవత్సరాలు నిండిన యువతీ, యువకులకు రూ.10 లక్షలు ఇవ్వాలన్నారు. అనాదిగా సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, నిర్వాసితుల కుటుంబాలలో అర్హతను బట్టి కుటుంబానికొక ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. విభజన హామీలు అమలు చేయడంలో మోడీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా మోడీ విదేశాలలో ఉన్న నల్లధనాన్ని వెలికి తీసి పేదల బ్యాంకు ఖాతాల్లో రూ.15 లక్షలు వేస్తానని మోసం చేశాడని విమర్శించారు. ఈ నెల 26వ తేదీన పోలవరంలో జరిగే బహిరంగ సభకు మండలం నుంచి అధికసంఖ్యలో తరలివచ్చి సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్న బాబు మాట్లాడుతూ అప్పలరాజు గూడెం వన సంరక్షణ సమితి సభ్యులకు సాగు పట్టాలు ఇచ్చి సీతం పేట, బందంచర్ల, టి నరసాపురంలో వన సంరక్షణ సమితులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమితి సభ్యులు బి ఎన్ సాగర్, సిపిఐ మండల కార్యదర్శి సాకా గంగరాజు,తాడిగడప జయరాజు, వీరంకి వెంకట్రావు, కొండముచ్చు శ్రీనివాస రావు, మల్లెల సత్యనారాయణ, మానుకొండ మోహన్ రావు ,తదితరులు పాల్గొన్నారు.

నారుమళ్ళకు నీరు అందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: కాలువలకు నీటి విడుదలను సమన్వయం చేస్తూ నారుమళ్ళకు పూర్తిస్థాయిలో నీటిని అందించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక స్పందన సమావేశ మందిరంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు కైగాల శ్రీనివాస రావు అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం నరసాపురం కాలువకు 4 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు తెలిపారు. నీటిమట్టం తక్కువగా ఉండటం వలన నారుమళ్ళకు ఇబ్బంది అవుతుందని సమావేశం దృష్టికి తీసుకురాగా జిల్లా కలెక్టర్ స్పందిస్తూ నీటిపారుదల శాఖ అధికారులు నీటి విడుదలను సమన్వయం చేస్తూ నారుమళ్ళకు పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలని ఆదేశించినట్టు పేర్కొన్నారు. ఖరీఫ్ పంట కాలంలో 96,075 హెక్టార్లు వివిధ పంటల సాగుకు ప్రణాళిక సిద్ధం చేయగా, వాటిలో వరి 95,600 హెక్టార్లు, అపరాలు 60 హెక్టార్లు, చెరుకు 400 హెక్టార్లు, వేరుశనగ 15 హెక్టార్లు ఉన్నాయన్నారు. ఖరీఫ్ సాగుకు 5,25,800 మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి అంచనా వేసినట్టు తెలిపారు. రైతు నేల స్వభావాన్ని బట్టి అనుకూలమైన పంటను విత్తేందుకు జిల్లాలో మొత్తం 15,014 మట్టి నమూనాలను సేకరించాలని లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. అనంతరం జరిగిన డిసిసి, డి ఎల్ ఆర్ సి సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడారు.

మండుతున్న ఎండలు.. అల్లాడుతున్న ప్రజలు

- స్కూళ్ళకి వెళ్ళలేని పరిస్థితుల్లో విద్యార్థులు
- స్కూళ్ళల్లో పెరగని హాజరు

విశాలాంధ్ర - లింగపాలెం : మండుతున్న ఎండలు.. ఎండలతో పాటు వడగాడ్పులు.. ప్రజలు ఇళ్ళ నుంచి బయటకు రాలేక అల్లాడుతున్నారు. పగలు, రాత్రి అనేది లేకుండా వేడికి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. అధిక ఉష్ణోగ్రతలకు ఏసీలు పనిచేయటంలేదు. ఫ్యాన్లు వేసినా వేడిగాలి.. ఫ్యాన్లు వేసుకోకపోతే ఉక్కపోతకు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇళ్ళల్లో కాకుండా ఇళ్ళ బయట ఉండాలంటే వేడిగాలులతో తల్లడిల్లుతున్నారు. జూన్ నెల సగం దాటినా ఏ మాత్రం వేడి తగ్గలేదు. ఇంత వేడిలో విద్యార్థులు బడికి వెళ్ళలేకపోతున్నారు. బడికి వెళ్ళిన విద్యార్థులు తరగతి గదులలో కూర్చోలేక ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. బడులకు వెళ్ళే విద్యార్థులు ఎండకు అల్లాడుతున్నారు. స్కూళ్ళు మొదలై ఐదు రోజులు దాటుతున్నా లింగపాలెం మండలంలో కనీసం 20 శాతం హాజరు ఉండటంలేదు. వసతి గృహాలకు విద్యార్థులు ఎండకు భయపడి రావటంలేదు. తల్లిదండ్రులు సైతం ఇంత ఎండలో స్కూళ్ళకు, వసతి గృహాలకు పంపలేమని అంటున్నారు. పిల్లలకు బడికి పంపాలని ఉపాధ్యాయులు సైతం అడగలేకపోతున్నారు. ఇళ్ళ నుంచి బయటకు రాలేకుండా ఉంటే ఈ పరిస్థితుల్లో పిల్లలను బడులకు పంపలేమని తల్లిదండ్రులు అంటున్నారు. వర్షాలు లేవు. కనీసం వాతావరణం చల్లబడితే ఉపశమనంగా ఉంటుందని ఆశపడుతున్నారు. ఎండలు ప్రతీ ఒక్కరికి శాపంలా ఉన్నాయి. పనులు చేసుకోలేకపోతున్నారు. ప్రయాణాలు చేయలేక పోతున్నారు. కొబ్బరి బొండాలు, శీతల పానీయాలకు డిమాండు పెరగడంతో ఆయా దుకాణాలు కిటకిటలాడుతున్నాయి.

జగనన్న ఇళ్లు వేగవంతం చేయాలి

విశాలాంధ్ర - లింగపాలెం : లింగపాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం జరిగింది. సమావేశంలో పలు అంశాలపై అధికారులు వివరించారు. జగనన్న ఇళ్ళ నిర్మాణాన్ని వేగవంతంగా పూర్తి చేసేందుకు ప్రజాప్రతినిధులు సహకరించాలని గృహ నిర్మాణ శాఖ ఎఇ వెంకటేశ్వరరావు కోరారు. విద్యార్థులకు ప్రభుత్వం అందించిన జగనన్న విద్యా సదుపాయాలను మండల విద్యాశాఖాధికారి రామారావు తెలిపారు. డ్రాప్ అవుట్స్ లేకుండా చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈయన కోరారు. ఖరీఫ్ సీజనులో నారులు పోసేందుకు వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయశాఖాధికారి మురళీకృష్ణ తెలిపారు. కౌలు రైతులకు కౌలు కార్డులు ఇస్తున్నామని, కార్డులు పొందిన రైతులకు ప్రభుత్వ సదుపాయాలు వర్తిస్తాయని అన్నారు. సమావేశంలో ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభలో ప్రస్తావించారు. సమావేశంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మట్టా సురేష్, కిర్లపూడి ఝాన్సీ, ప్రత్యేక అధికారి గిరి, ఎంపిడిఓ ఆశీర్వాదం, తహశీల్దార్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

విశాలాంధ్ర-ముదినేపల్లి : విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా తాటాకు దడులతో ఏర్పాటు చేసుకున్న రేకుల ఇల్లు దగ్ధమైంది. మండలంలోని పెదపాలపర్రు గ్రామానికి చెందిన వెదురూరి రాజారావుకు చెందిన ఇంటిలో ఉదయం అందరూ పనికి వెళ్లిన సమయంలో మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు అదుపు చేసేందుకు ప్రయత్నించి గుడివాడ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. ఇది తెలుసుకున్న రాజారావు కుటుంబ సభ్యులు వచ్చేసరికి ఇంటిలో సామానులు సమస్తం బుగ్గిపాలయ్యాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు.

అక్రమ మద్యం సీసాలు స్వాధీనం

- ముగ్గురి అరెస్ట్

విశాలాంధ్ర -నూజివీడు టౌన్: నూజివీడు సర్కిల్ పరిధిలోని ఆగిరిపల్లి, సగ్గూరు గ్రామాల్లో డిస్ట్రిక్ట్ టాస్క్ ఫోర్స్ జరిపిన దాడుల్లో ముగ్గురిని అరెస్ట్ చేసి అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు ఎస్ఇబి సిఐ పి.గోపాలకృష్ణ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రం ఆగిరిపల్లిలో వాకా రంగారావు ఇంటిలో 81 తెలంగాణ మద్యం సీసాలు స్వాధీన పరుచుకుని రంగారావుతో పాటు పరస ప్రసాదరావును అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మద్యాన్ని సరఫరా చేసిన దాసరి వినోద్ పై కూడా కేసు నమోదు చేశామన్నారు. సగ్గూరు గ్రామంలో చంగల సింగయ్య వద్ద అక్రమంగా కలిగి ఉన్న 5 లీటర్ల నాటు సారాను స్వాధీన పరుచుకుని కేసు నమోదు చేశామన్నారు. అరెస్టు చేసిన ముగ్గురు వ్యక్తులను జుడిషియల్ రిమాండ్ తరలించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు జిల్లా టాస్క్ ఫోర్స్ సిఐ కృష్ణ ధనరాజ్, ఎస్ఐ అల్లూరయ్య సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్వో చొరవతో అక్రమ మట్టి తవ్వకాలు నిలుపుదల

విశాలాంధ్ర-ఉండి: ఉండి మండలం యండగండి గ్రామ పరిధిలో జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను శుక్రవారం వీఆర్వో బాలకృష్ణ నిలుపుదల చేసి లారీలను వెనక్కి పంపించారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా పేదలకు ఇచ్చిన ఇళ్ల స్థలాలను పూడ్చిన తర్వాతే మిగతా ప్రైవేటు పనులు చేయాలని అంతవరకు ప్రభుత్వం అనుమతి లేకుండా నా పరిధిలో ఎటువంటి అక్రమ మట్టి తవ్వకాలు జరిగిన నిలుపుదల చేయడం జరుగుతుందని వారు సూచించారు. రైతులు మట్టి తవ్వకాలు జరిపిన ప్రతి ఒక్కరూ సహకరించాలని వారు కోరారు. మైనింగ్ అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరిపిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు సూచించారు.

నాణ్యత కలిగిన బ్యాగులను సరఫరా చేయాలి

- ఏఐఎస్ఎఫ్ డిమాండ్

విశాలాంధ్ర-పెనుగొండ: జగనన్న విద్యా కానుకను పూర్తి స్థాయిలో విద్యార్థులకు పంపిణీ చేయాలని, నాణ్యత గల బ్యాగ్, షూలు విద్యార్థులకు పంపిణీ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి టి అప్పలస్వామి డిమాండ్ చేశారు. ఏ ఐ ఎస్ ఎఫ్ రాష్ట్ర పిలుపులో భాగంగా శుక్రవారం పెనుగొండ గ్రామంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏఐఎస్ఎఫ్ నాయకులు విద్యాకానుక కిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా టి. అప్పలస్వామి మాట్లాడుతూ జగనన్న విద్యా కానుకను పూర్తి స్థాయిలో విద్యార్థులకు పంపిణీ చేయాలని నాణ్యత గల కిట్లనే అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో నాడు నేడు పనులు ఒక ప్రక్క జరుగుతుంటే మరో వైపు పాఠశాలలను ప్రారంభించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాడు నేడు పనులు వేగవంతంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ పెనుగొండ మండల కార్యదర్శి కదలి పురుషోత్తం, కె. బాలు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రూరల్ మండలం ఏర్పాటు

- ఫలించిన ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి కృషి

విశాలాంధ్ర- ఏలూరు: ఏలూరును రెండు మండలాలుగా విభజిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇకనుండి ఏలూరు మండలం, ఏలూరు రూరల్ మండలాలుగా కొనసాగుతాయి. ఏలూరు రూరల్ మండలంలో చాటపర్రు, జాలిపూడి, కాట్లంపూడి, మాదేపల్లి, మల్కాపురం, మానూరు, శ్రీపర్రు, కలకుర్రు, కోమటి లంక, గుడివాక లంక, కొక్కిరాయిలంక, పైడి చింతపాడు, ప్రతి కోళ్ల లంక మొత్తం 13 రెవెన్యూ గ్రామాలతో విభజిస్తూ ప్రభుత్వం గురువారం జీవో జారీ చేసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ దశాబ్దాలుగా ఎదురు చూస్తున్న ప్రజల కల సాకారం అయినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ కు అనేక సార్లు ఏలూరు రూరల్ మండలం ఏర్పాటు, ఇక్కడి ప్రజల అభిలాషగా తాను తెలపడం జరిగిందని, ఈ విషయంపై ఆయన సానుకూలంగా స్పందించి తమ విన్నపాన్ని మన్నించడం ఎంతో శుభపరిణామం అని ముఖ్యమంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలం ఏర్పాటుకు సంబంధించిన ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసిన జిల్లా కలెక్టర్ , రెవెన్యూ శాఖ అధికారులను ఆయన అభినందించారు.ఏలూరు రూరల్ మండలానికి సంబంధించి త్వరలోనే చాటపర్రులో తహసిల్దార్ కార్యాలయం ఏర్పాటు అవుతుందని, ప్రభుత్వ పనులన్నీ చాటపర్రు కేంద్రంగా జరుగుతాయని తెలిపారు. లంక గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి.హెచ్.అగ్రహారం, కాశిపాడు గ్రామాలలో మలే రియా వ్యతిరేక మాసోత్సవాల అవగాహన కార్యక్రమం ఆరోగ్య సహాయకుడు నామాల రాజు శుక్రవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా నామాల రాజు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి గ్రామంలో ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండ కూడదని దోమ పుట్ట కూడదని పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడవలసిన బాధ్యత మన అందరిది అని అన్నారు. మన ఆరోగ్యం మన చేతుల్లోనే వున్నది అన్నారు. ఈ కార్యక్రమంలో ఎం ఎల్ హెచ్ పి మాధురి ప్రకాష్, ఏఎన్ఎం లు ఏసమ్మ,పి. శివ కుమారి, ఆశ కార్య కర్తలు బి.లక్ష్మీ భవాని,పి.దుర్గ వరలక్ష్మీ,కృష్ణ కుమారి, అంగన్‌వాడి టీచర్ డి.శ్రీ దేవీ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నతంగా చదువుకోవాలి

విశాలాంధ్ర -భీమవరం టౌన్ : విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధిస్తే తల్లిదండ్రులకు ఆయా కళాశాలకు ఎంతో గౌరవమని భీమ వరం ఆర్డీవో దాసిరాజు అన్నారు. శుక్రవారం ఆయన భీమవరం సిఎస్ఎన్ డిగ్రీ, పిజి కళాశాలలో ప్రతిభ చాటిన విద్యార్థులకు శ్రీవిజ్ఞాన వేదిక, లయన్స్ క్లబ్‌ఆధ్వర్యంలో మెడల్స్, ప్రశంసాపత్రాలను ఆర్డీవో దాసిరాజు అందజేశారు. దాసిరాజు మాట్లాడుతూ తలిదండ్రులు మీపై ఎంతో నమ్మకం పెట్టుకుంటారని, అందువల్ల చదువు పట్ల విద్యార్థులు శ్రద్ధ వహించాలన్నారు. ఆడ పిల్లలు చదువులో ముందడుగులో ఉంటున్నారని, బాలురు కూడా ముందంజలో ఉండాలన్నారు. కళాశాల సెక్రటరీ డాక్టర్ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ళ సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థులకు పేద విద్యార్థులకు కళాశాల ఎల్లప్పుడూ సహాయ సహకారాలను అందిస్తుందని, గత 16 ఏళ్లుగా శ్రీవిజ్ఞానవేదిక ప్రతిభ కలిగిన విద్యార్థులకు మెడల్స్ అందించడం అభినందనీయమన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ సిఎస్ఎన్ కళాశాలలో బిఎ, బికాం, బిఎస్సిలో ప్రతిభ కనబరిచిన వారికి మెడల్స్, ప్రశంసాపత్రాలను అందించారు. అనంతరం ఆర్డీవో దాసిరాజును కళాశాల యాజమాన్యం సత్కరించారు. కార్యక్రమంలో కంతేటి వెంకట్రాజు, బొమ్మదేవర ప్రభాకర్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు నందమూరి రాజేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రానికి కుర్చీలు అందజేత

విశాలాంధ్ర-మండవల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు తోడు దాతలు తమ వంతు సహాయం అందిస్తేనే అభివృద్ధి వేగవంతంగా సాగి పేదలకు భరోసా లభిస్తుంది. మండవల్లి గ్రామంలోని అంగన్‌వాడి -4 సెంటర్‌కు స్థానిక పంచా యతీ వార్డు సభ్యురాలు బొమ్మనబోయిన నాగస్వాతి రాజేష్ ఆరు కుర్చీలను వితరణగా అందించారు. శుక్రవారం అంగనవాడీలో జరిగిన కార్యక్రమంలో సిబ్బందికి కుర్చీలు అందివ్వగా కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ మెండా ఝాన్సీతో పాటు ఐసిడిఎస్ సూపర్‌వైజరు కల్పవల్లి, వైసిపి నాయకులు మెండా సురేష్‌లు దాతను అభినందించారు.

విద్యతోనే ఉజ్వల భవిత

విశాలాంధ్ర-మండవల్లి: విద్యతోనే భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవచ్చని మండవల్లి గ్రామ సర్పంచ్ మెండా ఝాన్సీ అన్నారు. మార్చి -2023 పదవ తరగతి పరీక్షల్లో మండవల్లి హైస్కూలు నుండి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు సర్టిఫికేట్లు,మెడల్స్ పంపిణీ కార్యక్రమం శుక్రవారం మండవల్లి జడ్పీహైస్కూలులో జరిగింది. ప్రభుత్వం అందచేసిన జగనన్న ఆణిముత్యం సర్టిఫికేట్లు,మెడల్స్‌ను ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలు పొందిన సిహెచ్.యువసాయి ప్రదీప్, జి.కుసుమ, జి.జగదీష్‌లకు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పివిఎస్ఎస్‌జి ప్రసాద్, అధ్యాపకులు, వైసిపి నాయకులు మెండా సురేష్ పాల్గొన్నారు. విద్యార్థులను అభినందించి రానున్న రోజుల్లోను పరీక్షల్లో సత్తాచాటాలని సూచించారు.

FEDBANK
FINANCIAL SERVICES LIMITED

ఫెడ్ బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్
కార్పొరేట్ ఆఫీస్: కానాకియ వాల్ స్ట్రీట్, ఎ-వింగ్, 5వ అంతస్తు, యూనిట్ నెం. 501, 511, 512, అంధేరి-కుర్ల రోడ్డు, చాకల, అంధేరి, ఈస్ట్ ముంబాయి, మహారాష్ట్ర-40093.

డిమాండ్ నోటీసు

[illegible]

క్ర. నెం.	సంబంధింపబడిన ఋణగ్రహీత / సహ-ఋణగ్రహీత / హామీదారుల పేర్లు	సెక్యూర్డ్ ఆస్తుల వివరణ / తనఖా ఆస్తి	సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ నోటీసు తేదీ & మొత్తం బకాయి
1	[illegible]	[illegible]	14-06-2023 ది.09-06-2023 తేదీనాటికి రూ.27,48,939/- (అక్షరాల ఇరవై ఏడు లక్షల నలభై ఎనిమిది వేల తొమ్మిది వందల ముప్పై తొమ్మిది రూపాయలు మాత్రమే) NPA తేది: 07-05-2023

[illegible]

ప్రదేశము: విజయవాడ, తేది: 17-06-2023 | సం/- అధీకృత అధికారి, ఫెడ్‌బ్యాంక్ ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్

నోటీసు
మహారాజశ్రీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వినియోగదారుల సమస్యల పరిష్కార కమీషన్ గారి కోర్టు, విజయవాడలో
F.A.I.A. No. 681/2022 in F.A. No. 318/2010 in CC No.32/2009
(పశ్చిమగోదావరి జిల్లా వినియోగదారుల ఫోరమ్ ఏలూరు వారి ఫైలు)
బిట్వీన్ :
యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కం.లిం. రి.బై ఇట్స్ డివిజనల్ మేనేజర్, పోస్ట్ బాక్స్ నెం.9,శ్రీరామపురం, భీమవరం, వెస్ట్ గోదావరి జిల్లా. ...పిటీషనర్/అప్పిలెంట్/ఆపోజిట్ పార్టీ
మరియు
పాతపాటి సత్యవతి ...రెస్పాండెంట్/కంప్లైనెంట్
టు:
పాతపాటి సత్యవతి, భర్త. లేటు పి. సాంబరాజు, నివాసము: అర్ధహపరం, గణపవరం(మం), పశ్చిమగోదావరి జిల్లా.
పైనెంబరు ఎఫ్.ఏ.ఐ.ఏ.లో రెస్పాండెంట్ అయిన మీకు పైస్టేట్ కమీషన్/శ్రీకోర్టు ద్వారాను, రిజిష్టరు పోస్టు ద్వారాను నోటీసులు పంపినను మీరు తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీకు ఈపేపర్ ప్రకటనద్వారా నోటీసు చేయవలసినదిగా హైకోర్టు /స్టేట్‌కమీషన్ వారు ఆర్డరువేస్తూ ది.03-07- 2023కి వాయిదా వేసియున్నారు. సదరు వాయిదా రోజు ఉ॥గం॥10-30ని॥లకు మీరు స్వయంగాగాని లేక మీ అడ్వకేటు ద్వారా గాని పై కమీషన్ వారి ఎదుట హాజరై మీకుగల ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనియెడల సదరు అప్పీలును మీపరోక్షమందు విచారించి తీర్మానించబడును. (శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదా తేది.03-07-2023

చేబ్రోలు యజ్ఞనారాయణ,
అప్పిలెంట్ తరపు న్యాయవాది, గుంటూరు.సెల్: 9848277609

ఆలయ భూముల వేలంపాట

విశాలాంధ్ర- ముసునూరు: బలివే గ్రామ శ్రీరామలింగేశ్వర స్వామి ఆలయ భూముల వేలంపాటలో రైతులు పాల్గొని వేలంపాట విజయవంతం చేయాలని బలివే గ్రామంలో వేంచేసిన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయాధికారి ఆకుల కొండలరావు పేర్కొన్నారు.శుక్రవారం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ ఏలూరు జిల్లా నూజివీడు డివిజన్ ముసునూరు మండలంలోని బలివే గ్రామంలోవేంచేసిన శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానమునకు చెందిన ఆలయ భూములు అర్.యస్.నెం.118లో య.8-78 సెంట్లు భూమి, వేల్పుచర్ల గ్రామంలో అర్.యస్.నెం.376లో య.1-16 సెంట్లు భూమి.3 సంవత్సరాల కాలపరిమితి కౌలు వేలం పాట గాను ది.19.6.2023 వ తేది సోమవారం ఉదయం పదకొండు గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద దేవదాయ ధర్మదాయ శాఖాధికారుల పర్యవేక్షణలో టెండర్ కం,బహిరంగ వేలంపాట నిర్వహించబడునని, ఆదే రోజు మధ్యాహ్నం 12 గంటలకు ఆలయశాఖాధికారులు, పోలీస్, రెవిన్యూ, భక్తులు,గ్రామస్థుల సమక్షంలో శ్రీ స్వామి వార్ల హుండీ లెక్కించటకు నిర్ణయించినట్లు ఆలయ ఇఒ తెలిపారు.

హౌసింగ్ అధికారులపై వైసీపీ నేతల అసంతృప్తి

విశాలాంధ్ర -చాట్రాయి : హౌసింగ్ అధికారులతో వైసీపీ నేతలు జరిపిన ప్రత్యేక సమావేశంలో అధికారుల తీరుపై వైసీపీ నేతలు అసహనం వ్యక్తం చేశారు. శుక్రవారం మధ్యాహ్నం చాట్రాయి మండల పరిషత్ కార్యాలయంలో నూజివీడు గృహ నిర్మాణ శాఖ ఈఈ శ్రీదేవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశం ముఖ్యమైన ఉద్దేశం ఇటీవల కాలంలో

వైసీపీగ్రామ మండల నేతల హామీపైనూతనంగా ఇల్లు నిర్మాణం పూర్తి చేసిన వారికి బిల్లులు ఇప్పించాలని లేకపోతే పార్టీకి ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందనేది ముఖ్యమైన ఉద్దేశం కావడం గమనార్హం. మండలంలో షుమారు 436ఇళ్ళకు బిల్లు ఇప్పించాలని వైసీపీ నేతలు కోరగా ఈఈ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్పెషల్ డిక్లరేషన్ ఇవ్వాలని అనడంతో వైసిపి సీనియర్ నాయకులు పోలవరం పిఏసిఎస్ ఛైర్మన్ చెలికాని బాబ్జి అసహనంతో సమావేశం నుంచి లేచి అందరికన్నా ముందు బయటకు వెళ్ళి పోయారు.అధికారులు అక్కడొక మాట ఇక్కడ ఒక్కమాట చెపుతున్నారని పలువురు అంటున్నారు.నాయకుల హామీతోనే ఇళ్ళు నిర్మాణం జరిగిందని వందలాది మంది కి ఏమని సమాధానం చెప్పాలి అనేది చర్చనీయాంశం అయింది.ఈసమావేశంలో ఎపి కోపరేటివ్ యూనియన్ ఛైర్మన్ దేశి రెడ్డి రాఘవరెడ్డి తహశీల్దార్ విశ్వనాథ రావు తదితరులు పాల్గొన్నారు.

కెరీర్ ప్రోగ్రామ్‌కు 9 మంది అర్హత

విశాలాంధ్ర-జంగారెడ్డిగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ,సీడాప్, ఉపాధి కార్యాలయం, హెచ్ సి ఎల్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీరామచంద్ర డిగ్రీ కళాశాల నందు ఏర్పాటు చేసిన హెచ్ సి ఎల్ టెక్ బీ "క్యాంపస్ డ్రైవ్" కెరీర్ ప్రోగ్రాంకు 52 మంది అభ్యర్థులు హాజరై 9 మంది మొదటి దశలో లో

అర్హత పొందారని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఈ. తమ్మాజీ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడాప్ ఉపాధి కార్యాలయం ప్రతినిధి వై పి ప్రవీణ్, కళాశాల కరస్పాండెంట్ జగదీష్ , హెచ్ సి ఎల్ సిబ్బంది సాయి కిరణ్ ,ఎపిఎస్ఎస్ డి సి సిబ్బంది ,పి ఒ ప్రవీణ్, ఈ ఎస్ సి కోఆర్డినేటర్స్ రామకృష్ణ, సత్యనారాయణ, కార్తీక్ పాల్గొన్నారు.

హైస్కూల్ విద్యార్థులకు ఉచితంగా కళ్ళజోళ్ళు పంపిణీ

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గణపవరం జిల్లా పరిషత్ బాలికల హై స్కూల్, బాలుర స్కూలులలో డాక్టర్ వైయస్సార్ కంటి వెలుగు ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు పి హెచ్ సి వైద్యాధికారి డాక్టర్ పి హెచ్ ఆర్ సంతోష్ నాయుడు, డాక్టర్ పి కిరణ్మయి, మండల విద్యాశాఖ అధికారి పుచ్చల శేషు,నేత్ర వైద్యాధికారి ఐ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాలికల హైస్కూల్లో 35 మందికి, బాలుర హైస్కూల్లో గణపవరంలో19 మందికి కళ్ళజోళ్ళు ఉచితంగా అందజేసి నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ హెచ్ ఎం బాల భాస్కర్ రావు, సి హెచ్ ఓ జె విల్సన్ బాబు, ఎ. కృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రన్నకు చేయూతనివ్వండి

విశాలాంధ్ర - చాట్రాయి : ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇస్తున్న టిడిపి అధినేత చంద్రబాబు కు ప్రతి ఒక్కరూ చేయూతనివ్వాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు కోరారు.శుక్రవారం చాట్రాయి మండలం ఆరుగొలను పేట లో భవిష్యత్తు కు గ్యారంటీ కార్యక్రమం రెండోరోజు కొనసాగించారు. ఈ

సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో తెలుగు రైతు ఏలూరు జిల్లా ప్రధాన కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు,మండలం టిడిపి అధ్యక్షులు మరిడి వేంకటేశ్వరరావు ప్రధాన కార్యదర్శి పాల్గొని దుర్గారావు ఇజ్జిగాని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాలేయ చికిత్సకు సీఎం జగన్ 10 లక్షలు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - కాట్రేనికోన : మండలంలోని కొప్పిగుంట గ్రామానికి చెందిన వైసిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు బొక్క రమణ (వెంకటేశ్వరరావు)కు కాలేయ చికిత్స నిమిత్తం రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి 10 లక్షల రూపాయలను సీఎం సహాయ నిధి నుండి మంజూరు చేశారు. గత కొంతకాలంగా రమణ అనారోగ్యంతో బాధపడుతూ కాలేయ

మార్పిడి నిమిత్తం ఏఐజి హాస్పిటల్, సికింద్రాబాద్‌లో వైద్యం పొందుతున్నారు. హాస్పిటల్ వారు ఇచ్చిన ఎల్ఓసి ప్రకారం ముమ్మిడివరం శాసనసభ్యులు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కలిసి పరిస్థితిని వివరించగా స్పందించిన సీఎం పార్టీ కోసం పనిచేసిన రమణకు 10 లక్షలు మంజూరు చేశారు. మంజూరు ఉత్తర్వులను ఎమ్మెల్యే సతీష్ కుమార్ బాధితుడు రమణ కుటుంబ సభ్యులుకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంది కుప్ప సొసైటీ అధ్యక్షులు ఏడిదసుబ్బారావు, మాజీ జెడ్పిటిసి పాలెపు ధర్మారావు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ఆలమూరు : ఈ నెల 23వ తేదీ నుంచి వచ్చే నెల 23వ తేదీ వరకూ నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు జనగన్నకు చెబుదాం కార్యక్రమానికి అనుసంధానంగా 'సురక్ష' కార్యక్రమాన్ని చేపడుతున్నామని తహసీల్దార్ ఐపీ.శెట్టి తెలియజేశారు. శుక్రవారం అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆలమూరు

మండల స్థాయి అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రతి ఇంటికీ గ్రామ వలంటీర్, సచివాలయం సిబ్బంది,గృహసారధులు, ప్రజా ప్రతినిధులు వెళ్లి సమస్యలు ఆరా తీయాలని సూచించారు. గతంలో దరఖాస్తులను తిరస్కరిస్తే అందుకు కారణాలను 'సురక్ష'లో భాగంగా వారికి స్వయంగా చెప్పాలని ఆదేశించారు. ఏ ఒక్కరికీ సచివాలయ పరిధిలో సమస్యలు లేకుండా అధికారులు చూడాలన్నారు.మండల స్థాయిలో ఎంపీడీవో, డిప్యూటీ తహసీల్దార్‌తో 'సురక్ష' కమిటీని నియమించాలని కమిటీ ఎప్పుడు పర్యటిస్తుందో ముందే సమాచారం ఇవ్వాలన్నారు. ఈ అవకాశాన్ని మండలంలో ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఫామ్ 6,7,8 క్లైములు పరిష్కరిస్తాం

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

విశాలాంధ్ర భీమవరం:జిల్లాలో పెండింగ్ లో ఉన్న ఫామ్-6,7,8 క్లైములను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ముఖేష్ కుమార్ మీనాకు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి వివరించారు. విజయవాడ నుంచి శుక్రవారం ఈఆర్ఓ.నెట్, ఈవిఎం గౌడౌన్లు, ఎపిక్ కార్డుల పంపిణీ, ఈపి కేసులు, ఎస్ఓపిలు, వివిధ అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్ లు, తదితరులతో రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్. రామ్ సుందర్ రెడ్డి, డిఆర్ఓ కె.కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లా డుతూ జిల్లాలో ఫామ్-6 క్లైములకు సంబంధించి 5,800 ఫామ్స్ రాగా, 862 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరితగతిన పరిష్కరిస్తా మన్నారు. ఫామ్-7 క్లైములకు సంబంధించి 2,549 ఫామ్స్ రాగా, 241 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, ఫామ్-8 క్లైములకు సంబంధించి 1,895 ఫామ్స్ రాగా, 354 ఫామ్స్ పెండింగ్ ఉన్నాయని, వాటిని త్వరగా పరిష్కరిస్తామని వివరించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నరసాపురం సబ్ కలెక్టర్ ఎం.సూర్య తేజ, భీమవరం ఆర్డీవో దాసిరాజు, ఆర్ఓలు, ఈఆర్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

వెంగయమ్మతల్లి ఆలయానికి స్థల దానం అభినందనీయం

విశాలాంధ్ర - కిర్లంపూడి : కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం కిర్లంపూడి మాన్యాలు ఆయకట్టు రైతులను, రైతు కూలీలను నిత్యం కంటికి రెప్పలా కాపాడుతున్న శ్రీ వెంగయమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి రెండు సెంట్లు పంట భూమి స్థలాన్ని అమ్మవారి ఆలయానికి దానం చేయడం ఎంతో

అభినందనీయమే గాక, శుభ పరిణామమని, అనిల్ పార్కింగ్ టైల్స్ అధినేత, శ్రీ వనదుర్గా దేవి అమ్మవారి ఆలయ అభివృద్ధి ప్రదాత సేనాపతి కన్నబాబు, శ్రీ సత్య సాయి సేవా సమితి అధ్యక్షులు ఒబ్బిలిశెట్టి బద్రి, పలువురు ఆయకట్టు రైతులు అన్నారు. కిర్లంపూడి మాన్యాలు పొలంలో ఎప్పటినుండో కొలువైయున్న రైతుల పాలిట కల్పవల్లి శ్రీ వెంగయమ్మ తల్లి ఆలయానికి కిర్లంపూడి మండలం చిల్లంగి గ్రామానికి చెందిన కీర్తిశేషులు గొడే లక్ష్మీనారాయణ, గొడే రాంబాబుల జ్ఞాపకార్థం వారి కుమారుడు గొడే చంద్రశేఖర్ గురువారం రైతుల సమక్షంలో కొలతలు వేహించి అమ్మ వారి ఆలయానికి అప్పజెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క అడుగు నేల వదలని ఈ రోజుల్లో అమ్మవారి ఆలయ నిర్మాణానికి అడగ్గానే ఎంతో విలువైన రెండు సెంట్లు పంట భూమిని ఉదారంగా ఇవ్వడం పట్ల చంద్రశేఖర్‌ను పలువురు ఆయకట్టు రైతులు అభినందించడమే, కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. ఈ సందర్భంగా గొడే చంద్రశేఖర్ మాట్లాడుతూ మా తండ్రి గొడే లక్ష్మీనారాయణ, చిన్నాన్న రాంబాబుల కోరిక మేరకు వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని, మా వెంగయమ్మ తల్లి ఆశీస్సులు మా కుటుంబానికి ఎల్లవేళలా ఉండాలని అమ్మ వారి ఆలయ నిర్మాణానికి స్థలాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ఆలయ నిర్మాణంలో కూడా తమ వంతు సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందించడం జరుగుతుందని ఈ సందర్భంగా తెలియజేసారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆయకట్టు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సేనాపతి కన్నబాబు మాట్లాడుతూ అమ్మవారి ఆలయానికి అడగ్గానే స్థలం ఇచ్చిన తన మిత్రుడు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలు తెలియజేయమే కాకుండా, ఆలయ అభివృద్ధికి ఎవరి దగ్గర విరాళాలు తీసుకోకుండా, ఆలయ అభివృద్ధి తానే చేస్తానని కన్నబాబు ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సాయి మాధవి విద్యార్థులు

విశాలాంధ్ర - అనపర్తి : ఆదికవి నన్నయ యూనివర్శిటీ డిగ్రీ ఐదవ సెమిస్టర్ పరీక్ష ఫలితాల్లో స్థానిక శ్రీ సాయిమాధవి డిగ్రీ కాలేజ్ విద్యార్థులు యూనివర్శిటీ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచినట్లు ప్రిన్సిపల్ ఎన్ నవీన్ తెలిపారు. బీఎస్సీ విభాగంలో టి.దుర్గాభవాని 9.8, ఎస్.లక్ష్మి 9.8, ఎం.నందిని 9.8, టి.విద్యా స్వప్నిక 9.8, కె. సౌమ్య శ్రీ 9.8, ఎస్.చిన్న సతీష్ రెడ్డి 9.6, ఎం.దుర్గా శిరీష 9.6, సిహెచ్. సురేఖ 9.5, ఎమ్.లక్ష్మీ లలిత 9.4, పి.కీర్తన 9.4, జి.గాయత్రి 9.4, ఎ.కళ్యాణి 9.3, ఎ.వి. పద్మావతి 9.3, డి.ఉషా రాణి 9.2, వై.రేణుక 9.2, వి.సత్యవేణి 9.1, ఎస్. మౌనిక 9.1, బి.లక్ష్మి అపర్ణ 9.1, పి.సత్య భాగ్య శ్రీ 9.0, టి.పావని 9.0, ఎస్. సత్యవేణి 9.0, ఎల్. మంజుల 9.0, ఎమ్.వినీత 8.9, ఒ. ప్రసన్న భవ్య శ్రీ 8.8, ఎమ్.అరుణ 8.7, ఎమ్.అబ్బాస్ హుస్సేన్ 8.7, బి.లావణ్య 8.5 పాయింట్లు సాధించారని ప్రిన్సిపాల్ తెలిపారు. బీకాం విభాగంలో డి.మౌనిక 9.0పాయింట్లు సాధించారని నవీన్ చెప్పారు.మొత్తంగా బిఎస్సి విభాగంలో 97.6 శాతం బీకామ్ విభాగంలో 96.5 శాతం ఉత్తీర్ణత సాధించారని ఆయన చెప్పారు.యూనివర్శిటీ ర్యాంకులు సాధించిన విద్యార్థులను ఎంఎస్ఆర్ విద్యాసంస్థల ఛైర్మన్ మల్లిడి అనంత సత్యనారాయణరెడ్డి, శ్రీసాయిమాధవి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ తేతలి రామభద్రారెడ్డి(మల్లంపూడి),సత్యభామ స్కూల్ డైరెక్టర్ ఎం.మాధవీలత, ఎమ్ఎస్ఆర్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ తాడి సతీష్ రెడ్డి అభినందించారు.

రోటరీ సేవలు సంతృప్తినిచ్చాయి

విశాలాంధ్ర-నిడదవోలు : రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ అందిస్తున్న సేవా కార్యక్రమాలు సంతృప్తినిచ్చాయని క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ భాస్కర రామ్ అన్నారు.గవర్నర్ అఫీషియల్ విజిట్ లో

భాగంగా ఆర్ఐ3020 డిస్ట్రిక్ట్ గవర్నర్ రొటేరియన్ ఏ కె ఎస్ భాస్కర రామ్ విశ్వనాథం శుక్రవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిడదవోలు సెంట్రల్ కు విచ్చేసినారు. క్లబ్ అధ్యక్షులు మాచర్ల మధుసూదనరావు , ఇతర సభ్యులతో కలిసి పలు సేవా కార్యక్రమం పాల్గొన్నారు తిమ్మరాజుపాలెం లింగంపల్లిలో ఉన్న శ్రీ బండి సూర్యనారాయణ లక్ష్మీకాంతమ్మ రోటరీ సెంట్రల్ వద్ద శ్రమను సందర్శించి ఆశ్రమంలో జరుగుతున్న అభివృద్ధి అడిగి తెలుసుకున్నారు.వృద్ధాశ్రమ అభివృద్ధి పనులకు,రూ250000/ను వృద్ధాశ్రమ గౌరవ అధ్యక్షులు బండి వేణుగోపాలకృష్ణ కు అందజేసారు అనంతరం నిర్వహించిన క్లబ్బు సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు మాచర్ల మధుసూదన రావు మాట్లాడుతూ 2022-2023 ఉచిత షుగర్ నిర్ధారణ పరీక్షలు 38 క్యాంపులు, వివిధ ప్రదేశాలలో 16 క్యాంపులు ద్వారామొక్కలు నాటడం, స్కూల్లో కాలేజీల్లో విద్యార్థిని విద్యార్థులకు హ్యాండ్ వాష్ 14 ప్రోగ్రామ్స్,విద్యార్థిని విద్యార్థులకు 14 మెడికల్ కిడ్స్ అందజేయడంతో పాటు, కాలేజీ ,స్కూల్లో ఫీజులు చెల్లించలేని విద్యార్థిని విద్యార్థులకు ఫీజులు చెల్లించడం జరిగిందని మధుసూదనరావు వివరించారు. ప్రజలలో పోలియో అవగాహన కొరకు పోలియో ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఔత్సాహిక కుటుంబాలకు నిత్యవసర సరుకులు అందజేయడం జరిగింది. ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా కళ్ళజోళ్ళు ,కంటి ఆపరేషన్ చేయించడం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించడం జరిగిందని తెలిపారు.గవర్నర్ ఏ కె ఎస్ భాస్కర రామ్ విశ్వనాథం మాట్లాడుతూ నిడదవోలు సెంట్రల్ సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారం ఎప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

అరటి నష్టం ప్రాథమిక అంచనా

విశాలాంధ్ర - శంఖవరం : శంఖవరం, రౌతులపూడి మండలాలలో ఉన్న గ్రామాలలో మంగళవారం వీచిన భారీ గాలులకు 42.5 ఎకరాలు అరటి తోటలలో నష్టం వాటిల్లినట్లు ఉద్యానవన శాఖాధికారి పి.అరుణ్ కుమార్ తెలిపారు. శుక్రవారం శంఖవరం మండలంలోని మండపం, కె. గౌరంపేట గ్రామాలలో నేలకొరిగిన అరటి తోటలను మండపం సచివాలయ ఉద్యానవన సహాయకులు శ్యాంసుందర్ వాలంటీర్లతో కలిసి ఉద్యానవన శాఖాధికారి అరుణ్ కుమార్ అరటి తోటలను పరిశీలించారు. 42.5 ఎకరాలు అరటి నష్టం వాటిల్లిందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. మామిడిలో పురుగులు పడుతున్నాయని దీని కారణం తెలియజేయాలని రైతు వేల్పుల రమణ అడిగారు. పండుగ అధికం కావడం వలన ఇలా జరుగుతుందన్నారు. పక్వానికి వచ్చిన పండ్లను కోయకుండా ఉంచోనట్లయితే ఈగ వాలిన కాయలపై మచ్చలు ఏర్పడి పురుగులు పడతాయని నివారణ కోసం బుట్టలను అమర్చుకుని మందులను పిచికారి చేయాలన్నారు. ఉధ్యానవన శాఖలో కొబ్బరి, మామిడి, జీడి మామిడి, మొక్కలకు సంవత్సరానికి ఒక్కో మొక్కకు 20రూపాయలు చెప్పిన రెండు సంవత్సరాల పాటు వస్తాయని అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎకరానికి అరవై కొబ్బరి మొక్క లు వేసుకోవచ్చునన్నారు. చిరుధాన్యాలు అనగా రాగులు, చోళ్ళు, కొర్రలు, సజ్జలు విత్తనాలు సబ్సిడీపై పంపిణీ చేస్తామన్నారు. సమీపంలో రైతు కేంద్రాలను సంప్రదించాలని ఆయన తెలిపారు. సచివాలయంలో యూరియా అందుబాటులో ఉన్నదని తెలియజేశారు.

కల్వర్టు పరిశీలించిన ఎమ్మెల్యే సత్తి

విశాలాంధ్ర - అనపర్తి : రాజానగరం-పెడపర్తి రోడ్డులో రామవరం పరిధిలో ఆర్ అండ్ బి ప్రత్యేక మరమ్మతు నిధులు రూ. 20 లక్షలతో నిర్మించిన కల్వర్టు శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ టెండర్ దక్కించుకున్న గుత్తేదారు, ఆర్ అండ్ బి అధికారులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో త్వరితగతిన నాణ్యతతో కూడిన సిమెంట్ కల్వర్టు నిర్మాణం చేయడం అభినందనీయమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఎంసి ఛైర్మన్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కర్రి గాంధీ రెడ్డి, టేకి బాబురావు, కోనాల సత్యనారాయణ రెడ్డి తదితరులు ఉన్నారు.

ఎన్టీఆర్ ట్రోఫీ వెస్టిండీస్ టీం కైవసం

విశాలాంధ్ర - గోపాలపురం : క్రీడలు యువతకు దేహదారుఢ్యంతోపాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తుందని తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాలపురం నియోజకవర్గ ఇన్చార్జ్ మద్దిపాటి వెంకటరాజు తెలిపారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు ఎన్టీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీజన్ 2 క్రికెట్ టోర్నమెంట్ నేటితో ముగిసింది. 15 రోజులపాటు నిర్వహించిన ఈ క్రికెట్ టోర్నమెంట్లో 40 టీములు పాల్గొన్నాయి. ఫైనల్ లో గోపాలపురం కు చెందిన వెస్టిండీస్ టీం, కొవ్వూరు 11 టీములు ఓర హూరిగాతలపడ్డాయి. గోపాలపురం చెందిన వెస్టిండీస్ టీం 45 పరుగుల తేడాతో విన్నర్స్ గా నిలిచి ట్రోఫీ తో పాటు రూ 30, వేలు నగదు కైవసం చేసుకుంది. రన్నర్స్ గా నిలిచిన కొవ్వూరు 11 టీం ట్రోఫీతో పాటు 20వేల రూపాయలు నగదు అందుకున్నారు. బెస్ట్ బౌలర్, బెస్ట్ బ్యాట్స్ మెన్, బెస్ట్ కీపర్, ఫీల్డర్ లకు జ్ఞాపికలు అందించారు. ఈ సందర్భంగా మద్దిపాటి మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుని ఎన్టీఆర్ పేరట టోర్నమెంట్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఎన్టీ రామారావు ఆశయాలకు అనుగుణంగా యువత ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగల సత్యనారాయణ, కొర్లపాటి రాము, జేష్ట శ్రీనివాసరావు, జ్యేష్ఠ శ్రీధర్, మద్దిపాటి రమేష్, ఈలి శరత్ బాబు, మద్దిపాటి రోహిత్ సాయి ఎంట్ర ప్రగడ మంగారావు, పడమటి శ్రీనివాసరావు యువత పాల్గొన్నారు.

అక్రమంగా నిల్వ చేసిన జీలుగు విత్తనాలు సీజ్

విశాలాంధ్ర-టీ నరసాపురం: బొర్రంపాలెం గ్రామంలో కొనకళ్ళ పవన్ కుమార్ కు చెందిన సత్య ఎంటర్ ప్రైజెస్ గోదాములో అక్రమంగా నిల్వ ఉంచిన 450 కేజీల జీలుగు విత్తనాలు సీజ్ చేసి షాపు యజమాని పై కేసు నమోదు చేసినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి డి ముత్యాలరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం వ్యవసాయ సహాయ సంచాలకులు బి నాగకుమార్, సిబ్బంది శుక్రవారం నిర్వహించిన దాడుల్లో బొర్రంపాలెంలో కొనకళ్ళ పవన్ కుమార్ కు చెందిన గోదాములో ఎటువంటి అనుమతులు లేకుండా 13వేల 5వందల విలువ కలిగిన మూడు రకాల బ్యాచ్ లలో తెలంగాణ రాష్ట్రం సత్తుపల్లి నుండి కొనుగోలు చేసి అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించామని తెలిపారు. 1955చట్టం ప్రకారం షాపు యజమాని పై 6ఎ కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఎటువంటి అనుమతులు లేని విత్తనాలు, ఎరువులు విక్రయాలు చేసినా అక్రమంగా నిల్వ ఉంచిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు.

చలో రాజానగరం విజయవంతం చేయండి

విశాలాంధ్ర - రాజానగరం : మండలంలోని మావిడి, జీడి మావిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై గళం విప్పేందుకు జనసేన పార్టీ తలపెట్టిన ఛలో రాజానగరం, ధర్నాను ప్రతిఒక్కరు విజయవంతం చేయాలని జనసేన నాయకులు బత్తుల బలరామకృష్ణ అన్నారు. ఈ సందర్భంగా పత్రిక ప్రకటన శుక్రవారం విడుదల చేశారు దీనిలో



భాగంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగు సంవత్సరాలుగా జీడిమామిడి,మామిడి రైతులు పంటలు సరిగ్గా పండక,పండినా సరైన గిట్టుబాటు ధరలు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారు.వీటిపై గళం విప్పేందుకు జనసేన ఆధ్వర్యంలో ఈ నెల 17న స్థానిక గాంధీ బొమ్మ వద్ద ఉదయం పది గంటలకు రైతులతో ధర్నా చేపట్టినట్లు చెప్పారు.కార్యక్రమాన్ని ప్రతి రైతు,నియోజకవర్గంలోని జనసేన నాయకులు, జనసైనికులు, వీర మహిళలు భారీగా తరలివచ్చి విజయవంతం చెయ్యాలని పిలుపునిచ్చారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - అనపర్తి : కుతుకులూరు చెరువు వద్ద అగ్ని ప్రమాదంలో నాయీ బ్రాహ్మణులకు చెందిన రెండు షాపులు పూర్తిగా దగ్ధం కావడం జరిగింది.దీంతో సుమారు రూ.2 లక్షల ఆస్తినష్టం జరిగింది. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదంలో నష్టపోయిన నాయీ బ్రాహ్మణులకు మురళి ఫ్రెండ్స్ సర్కిల్ తక్షణ సహాయం గా ఒక్కొక్కరికి రూ. 5 వేలు ఆర్థికసహాయం అందచేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమ తులసి సురేష్, గ్రామ కన్వీనర్ కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (పెద్దోడు),వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, కొవ్వూరి మురళి వెంకట కృష్ణా రెడ్డి ,తమ్ముడు శ్రీను, పోతంశెట్టి నాగిరెడ్డి, తేతల సతీష్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదిత్య బిజినెస్ స్కూల్‌లో లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ పై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గండేపల్లి : గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ బిజినెస్ స్కూల్‌లో లాజిస్టిక్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ పై అవగాహన సదస్సు నిర్వహించారు. డైరెక్టర్ డాక్టర్ ఎన్. సుగుణ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సదస్సుకు కాకినాడ జెఎన్‌టియు మేనేజ్మెంట్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న సి.సురేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లాజిస్టిక్స్ ఎగుమతులు, దిగుమతులు వంటి అంశాలలో భారత ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతుల గురించి వివరిస్తూ విద్యార్థులు లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్మెంట్ విద్యను మారుతున్న కాలానుగుణంగా ప్లానింగ్, సోర్సింగ్ మాన్యుఫాక్చరింగ్, డెలివరీ వంటి అంశాలపై పరిజ్ఞానం పెంపొందించుకున్నప్పుడు మాత్రమే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని వివరించారు. ముఖ్య అతిథిని ఆదిత్య యాజమాన్యం తరపున దుశ్శాలువా, జ్ఞాపిక యిచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎ.విజయ భార్గవి, మేనేజ్మెంట్ విభాగాధిపతి ఎం. గోవర్ధన్ రెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

అక్రమంగా వసూలు చేసిన డబ్బు తిరిగి రైతులకు ఇప్పించాలి

విశాలాంధ్ర - రావులపాలెం : అకాల వర్షాలు, తుపాన్ల కారణంగా పంట నష్టపోయిన రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు రైస్ మిల్లుల వద్ద అక్రమంగా వసూలు చేసిన డబ్బును తిరిగి ఇప్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలుగుదేశం పార్టీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ కోరారు. కొత్తపేట నియోజకవర్గ పార్టీ ఇన్చార్జి బండారు సత్యానందరావు సూచనల మేరకు శుక్రవారం రావులపాలెం మండలం గోపాలపురం, ఈతకోట గ్రామాల్లో ఆకుల రామకృష్ణ అధ్యక్షతన రైతు సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నష్టపోయిన రైతుల నుంచి ఈనెల 16వ తేదీ నుంచి 24వ తేదీ వరకు దరఖాస్తుల రూపంలో వివరాలు సేకరించి జిల్లా కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. రైతులకు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామని, పరిహారం ఇవ్వని పక్షంలో రాబోయే రోజుల్లో అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ప్రభుత్వమే పరిహారం అందజేస్తుందన్నారు. రైతులు తాము సాగుచేసిన భూమి విస్తీర్ణం, పంట నష్టం జరిగిన విధానం, రవాణా ఖర్చులు, హమాలీ ఖర్చులు, కల్లం ఖర్చులు, మిల్లుల్లో అదనంగా తూచిన ధాన్యం వెరసి రైతు నష్టపోయిన వివరాలను తమకు అందించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, కొత్తపేట నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షుడు జక్కంపూడి వెంకటస్వామి, గోపాలపురం, ఈతకోట గ్రామ పార్టీ అధ్యక్షులు మండలంలోని 12 గ్రామాల పార్టీ రైతు అధ్యక్షులు, రైతులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మహానేతల విగ్రహాల ధ్వంసం తీవ్రంగా ఖండిస్తున్నా

విశాలాంధ్ర - సీతానగరం: మహానేతల విగ్రహాల ధ్వంసం తీవ్రంగా ఖండిస్తున్నా అని వైఎస్ఆర్సీపీ ఉబయ గోదావరి జిల్లాల కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలో గల ఇనుగంటి వారిపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు మహానేత స్వర్గీయ జక్కంపూడి రామ్మోహనరావు గారి విగ్రహం ధ్వంసం

చేశారు. దీనిని పరిశీలించడానికి జక్కంపూడి గణేష్ శుక్రవారం చేరుకొని స్థానిక నాయకులు, పోలీసులతో చర్చించారు. ఈ సందర్భంగా జక్కంపూడి గణేష్ విలేకరులతో మాట్లాడుతూ కుల మత ప్రాంతాలకు అతీతంగా ఏ మహానేత విగ్రహం ధ్వంసమైనా తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజలకు వారు చేసిన సేవలను బట్టి ప్రజలలో వారి పేరు ప్రఖ్యాతులు ఉంటాయని అవి ఇలాంటి విగ్రహాల ధ్వంసం వల్ల చెరిగి పోవు అని అన్నారు. ఈ ఘటనకు బాధ్యులను పోలీసులు దర్యాప్తు చేసి కటినంగా శిక్షించాలని కోరారు. ఇటువంటి సంఘటనలు వల్ల ప్రజల మనోభావాలు దెబ్బతింటాయని అని అన్నారు. ఈ విగ్రహం, వంగలపూడి గ్రామంలో గల వంగవీటి రంగా గారి విగ్రహాలను స్థానిక నాయకులు త్వరలో తిరిగి నెలకొల్పుతారు. అలగే వీటి భద్రతకు సి సి కెమెరాలను ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ సత్యం రాంపండు, వైస్ ఎంపీపీ మదన్ బాబు, కో కన్వీనర్ హరిబాబు, మొదలగు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.